నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 8 ఏప్రిల్ 2024 | KAMAREDDY



నిజామాబాద్ నగరంలోని బస్వాగార్డెన్‌లో పద్మశాలీ జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

## వందరోజులైపాయే..
# హామీలెటుపాయే!

- హామీల అమలుకు ప్రశ్నించేవారు అవసరం
- అందుకే ఎంపీగా బాజిరెడ్డిని గెలిపించుకుందాం
- ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు ఎక్కడ?
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఈప్రాంత ప్రజలకు కనిపించిన దాఖలాలు లేవు
- పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి వేముల
- హాజరైన బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

మోర్తాడ్, ఏప్రిల్ 7: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వంద పదహారు రోజులు దాటిపోయినా..ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఇంతరకు అమలుచేయడంలేదని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. హామీల అమలు ఎటుపాయే అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మోర్తాడ్‌లోని లలితా గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేముల మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఉచిత బస్సు ప్రయాణమని చెప్పి బస్సుల సంఖ్యను తగ్గించారని తెలిపారు. ఉచిత విద్యుత్ కొందరికే అని, సబ్సిడీపై సిలిండర్ ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు.అసెంబ్లీ ఎన్నికల ముందు ఆహా..ఓహో అంటూ వాగ్దానాలు, హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ముఖం పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, అధికారం చేపట్టాక హామీల గురించి మాట్లాడిన తీరును వీడియో స్క్రీన్‌పై ప్రదర్శించి గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఒక్కసారి కూడా ఈ ప్రాంతానికి రాలేదన్నారు. ఇక్కడి ప్రజల బాగోగులు చూడలేదని అటువంటి వ్యక్తి ఓట్లు ఎలా అడుగుతాడని ప్రశ్నించారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వ హామీల అమలుపై ప్రశ్నించే గొంతుకను మనం ప్రోత్సహించాలని, బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఎంపీగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 14 ఏండ్లు పోరాటం చేసి సాధించుకున్న తెలంగాణను పదేండ్లు సీఎంగా కేసీఆర్ చేసిన కృషి అభినందించదగ్గదని ఇది ఇప్పుడు ప్రజలు మాట్లాడుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ వచ్చినప్పటినుంచి ఇటు రైతులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు సంబంధించిన క్లిప్పింగ్‌లను ప్రజల్లోకి తీసుకెళ్లి వారికి అవగాహన కల్పించాలని కార్యకర్తలు, నాయకులకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, వేదికపై లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

### పార్టీకి అండగా ఉండే వారే ఆణిముత్యాలు

పార్టీకి అండగా ఉండే కార్యకర్తలు, నాయకులు ఆణిముత్యాలని వేముల అన్నారు. పార్టీలు మారిన వారిని పిచ్చికుక్కలను కొట్టినట్లు కొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్న మాటలను గుర్తు చేశారు. పార్టీలు మారిన వారిని కొట్టాలా, పార్టీలు మారేలా ప్రోత్సహిస్తున్న వారిని కొట్టాలా అని ప్రశ్నించారు. దేనికో ఆశ పడి పార్టీనుంచి పోయిన వారు తన దృష్టిలో నీచులని అభివర్ణించారు.

### పసుపుబోర్డు కార్యాలయం ఎక్కడ?

ఐదు రోజుల్లో పసుపుబోర్డు తెప్పిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి ఇక్కడి ప్రజలు, రైతులను మోసం చేసి గెలిచిన ఎంపీ అర్వింద్ పసుపుబోర్డు కార్యాలయం ఎక్కడ ఉందో చూపించాలన్నారు. పసుపు, ఎర్రజొన్నలకు మద్దతు ధర కల్పిస్తానని చెప్పి, ఎక్కడ కాంటాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఐదేండ్లు ఎంపీగా ఈప్రాంత అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చాడో చెప్పాలన్నారు. మళ్లీ ఎన్నికలు రాగానే మోదీ పసుపుబోర్డు జీవో ఇచ్చాడని మరో అబద్ధం ఆడుతున్నాడని మండిపడ్డారు.

### అవకాశం ఇవ్వండి, అభివృద్ధి చేస్తా : బాజిరెడ్డి



లోక్‌సభ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని, అభివృద్ధికి నిధులు తీసుకొస్తానని బీఆర్ఎస్ లోక్‌సభ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా పనిచేసిన పరిచయాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ప్రాంతాలు తన గెలుపునకు కలసి వస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పసుపుబోర్డు విషయంలో మోసం చేసిన అర్వింద్‌కు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు ఒక్కటే అని, గత పార్లమెంట్ ఎన్నికల్లో అర్వింద్‌ను గెలిపించేందుకు కాంగ్రెస్‌కు చెందిన వారే కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో రైతునాయకుడు కోటపాటి నరసింహనాయుడు, బీఆర్ఎస్ మోర్తాడ్, కమ్మర్‌పల్లి, ఏర్గట్ల మండలాల అధ్యక్షులు ఏలియా, రేగుంట దేవేందర్, పూర్ణానందం, ఎంపీపీలు శివలింగు శ్రీనివాస్, గౌతమి, జడ్పీటీసీలు రాధ, రాజేశ్వర్, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ పాపాయిపవన్, బోగధరణీఆనంద్, గంగారెడ్డి, సత్యనారాయణ, జేసీ గంగారెడ్డి, చిన్నరాజేశ్వర్, రాజ్‌పాల్, మోర్తాడ్, ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తల పాదాలు కడిగి
# నెత్తిన పోసుకుంటా..

**మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి**

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 7: నిస్వార్థంగా సేవలందిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకుల పాదాలు కడిగి నెత్తిన పోసుకుంటానని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని వెంకటసాయి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన నస్రుల్లాబాద్, బీర్కూర్ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పక్క నియోజకవర్గంలో పనిచేయని నాయకుడిని అక్కడి ప్రజలు తంతే ఇక్కడికి వచ్చి మాట్లాడుతున్నారన్నారు. బీఆర్ఎస్ నుంచి దొంగలు, స్వార్థపరులు పోయారని, చెత్త పోయింది, గట్టి మిగిలిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు వారి స్వార్థం కోసం పార్టీ మారుతున్నారన్నారు. కష్టాల్లో ఉన్న వ్యక్తికి నేనున్నాననే నాయకులు కావాలని, అదే మనం కేసీఆర్‌కు ఇచ్చే ధైర్యమన్నారు. అతి త్వరలోనే మంచి రోజులు రాబోతున్నాయని, బండ్లు ఓడలవుతాయని, ఓడలు బండ్లవుతాయన్నారు. అధికారంలో ఉన్నపుడు నా పక్కన ఉండి అన్నీ అనుభవించిన కొంత మంది నాయకులు ఇప్పుడు పార్టీ మారారన్నారు.తనను మోసం చేసిన వారికి తగిన గుణపాఠం చెబుతానన్నారు. జహీరాబాద్ పార్లమెంటు అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కార్యకర్తలు, ప్రజలను కోరారు. కార్యక్రమంలో బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, ఎంపీపీలు విఠల్, రఘు, నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు పెర్క శ్రీనివాస్,జిల్లా కోఆప్షన్ సభ్యుడు మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

### నాకన్నా ధీటుగా పనిచేయాలనే భాస్కర్‌రెడ్డిని నియమించా..

భవిష్యత్తులో కూడా నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కాపాడుకుంటూ అండగా ఉండేందుకే తన కుమారుడు పోచారం భాస్కర్‌రెడ్డిని బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించానన్నారు. నమ్ముకున్నవాళ్లకు అండగా ఉండాలని, పేదలకు సేవ చేయాలని, మీకు అన్నివిధాలా అండగా ఉంటానన్నారు. నాకన్నా ధీటుగా పనిచేయాలనే ఉద్దేశంతోనే భాస్కర్‌రెడ్డిని నియమించానని పోచారం అన్నారు.

## మోసపూరిత కాంగ్రెస్‌కు
# ఓటుతో బుద్ధి చెప్పాలి

- అండగా ఉంటాం.. బీఆర్ఎస్ సైనికులు కష్టపడి పనిచేయాలి
- ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్
- జాతీయ పార్టీలతో ఉపయోగం లేదు..
- రైతుబిడ్డగా నన్ను ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్



మాట్లాడుతున్న ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్, పక్కన లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

భిక్కనూరు, ఏప్రిల్ 7: హామీలు అమలు చేయని మోసపూరిత కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధిచెప్పాలని, అభివృద్ధికి పాటుపడే బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రభుత్వ మాజీ విప్ గంప గోవర్ధన్ అన్నారు. జహీరాబాద్ లోక్‌సభ స్థానంపై గులాబీ జెండాను ఎగురవేసేందుకు బీఆర్ఎస్ సైనికులంతా కష్టపడి పనిచేయాలని కోరారు. భిక్కనూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి భిక్కనూర్ మండల కార్యకర్తల సమావేశంలో జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌తోపాటు గంప గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ భిక్కనూరు ఉమ్మడి మండలం ఉద్యమాలకు పెట్టింది పేరని, ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్‌కు కొండంత అండగా నిలిచిందన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడామని, ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని గడపగడపకూ వెళ్లి వివరించాలని, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తామని, స్థానికుడైన కాటిపల్లి వెంకటరమణారెడ్డికి అవకాశం ఇచ్చారన్నారు. సొంత నిధులు రూ.150కోట్లతో కామారెడ్డిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారని, అవన్నీ పూర్తి చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. మహారాష్ట్రకు చెందిన బీబీపాటిల్‌ను తెచ్చి రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే రాజీనామా చేయకుండా బీజేపీలో చేరడం సిగ్గుచేటని విమర్శించారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి నోటికొచ్చిన హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఇప్పటి వరకు ఏ ఒక్క రైతుకైనా రూ.రెండు లక్షల రుణమాఫీ అయ్యిందా అని అడిగారు. భిక్కనూరులో కొందరు పదవులు అనుభవించి బీఆర్ఎస్‌కు ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు.

### రైతుబిడ్డను ఆశీర్వదించండి..

జహీరాబాద్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ పార్టీలతో తెలంగాణకు ఉపయోగం లేదన్నారు. తాను 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ నాయకత్వంలో పనిచేశానని గుర్తుచేశారు. రైతుబిడ్డనైన తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దొంగ హామీలనిచ్చి 100రోజుల్లో హామీలు నెరవేరుస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, సిద్ధరామేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, వైస్ ఎంపీపీ యాదగిరి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి అత్తెలి శ్రీనివాస్, మాజీ సర్పంచులు తునికి వేణు, మధుమోహన్ రెడ్డి, పోతిరెడ్డి పాల్గొన్నారు.

### నెలరోజులుగా ఒళ్లు, కీళ్ల నొప్పులతో గిరిజనుల అవస్థలు

# మంచం పట్టిన సోమారం తండా



సోమారం తండాలో విషజ్వరాలతో బాధపడుతున్న గిరిజనులు

గాంధారి, ఏప్రిల్ 7: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని సోమారం తండా గిరిజనులు తీవ్రమైన జ్వరంతో అవస్థలు పడుతున్నారు. తండాలోని చిన్నా,పెద్దా తేడా లేకుండా ఏ ఇంట్లో చూసినా ఒళ్లు నొప్పులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. సుమారు వెయ్యి జనాభా ఉన్న తండాలో నెల రోజులుగా ప్రతి ఇంట్లో జ్వరంతో సతమతమవుతున్నారు. రోజుల తరబడి తగ్గకపోవడంతో గాంధారి, కామారెడ్డిలోని ప్రైవేటు దవాఖానలు ఆశ్రయిస్తూ వేలకు వేలు ఖర్చు చేసుకుంటున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలు ఓవర్ డోస్‌లు, గ్లూకోజ్‌ల పేరిట డబ్బులు గుంజుతున్నారని తండావాసులు తెలిపారు. నెల రోజులుగా జ్వరాలతో బాధపడని ఇల్లంటూ లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

# ఒకరిని రక్షించబోయి మరొకరు..

### చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి



చెరువులో పడి మృతిచెందిన మనోజ్‌రెడ్డి, మనోజ్ కుమార్ (ఫైల్)

బోధన్ రూరల్, ఏప్రిల్ 7: ఒకరిని రక్షించబోయి మరొకరు చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి చెందారు. ఈ ఘటన సాలూరా మండలంలోని కుమ్మన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. సాలూరా క్యాంప్ గ్రామానికి చెందిన మనోజ్‌రెడ్డి (22), మనోజ్‌కుమార్ (22) ఇద్దరూ ప్రతిరోజు మాదిరిగానే శనివారం సాయంత్రం వాకింగ్ కోసం వెళ్లారు. రాత్రయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు వారి కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం చెరువు ఒడ్డున వారి చెప్పులు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని గజఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టగా ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. చెరువులో కాళ్లు కడుక్కోవడానికి వెళ్లి జారిపడగా.. ఒకరిని రక్షించబోయి మరొకరు నీట మునిగి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఏరియా దవాఖానకు తరలించినట్లు పేర్కొన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగ్‌నాథ్ తెలిపారు.

# బీఆర్ఎస్‌లో చేరికలు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 7: బీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతున్నాయి. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన సమారు 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.ఆదివారం నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించగా..పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో తిమ్మాపూర్ మాజీ ఉపసర్పంచ్ రాంసింగ్, ఇస్లావత్ సరిచంద్, సురేందర్, తార్యా, హీరా, కిశోర్, నాగయ్య, రవి, శ్రీనివాస్, సంతోష్ తదితరులు ఉన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి






**రంజాన్ పండుగను పురస్కరించుకొని** నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నెహ్రూ పార్క్ చౌరస్తాలో సందడి వాతావరణం నెలకొన్నది. మరో మూడు రోజుల్లో పండుగ ఉండడంతో గాంధీ చౌక్, నెహ్రూ పార్క్, అహ్మదీబజార్ కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మహిళలు కొత్త బట్టలు, సుగంధ ద్రవ్యాలు, గాజులు తదితర వాటిని కొనుగోలు చేస్తున్నారు. హలీం, హలీస్ సెంటర్ల వద్ద రద్దీ నెలకొన్నది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ

# ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

కామారెడ్డి, ఏప్రిల్ 7: జిల్లావ్యాప్తంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహించారు. 6వ తరగతిలో ప్రవేశానికి మొత్తం 1,598 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 1,426 మంది హాజరయ్యారు. 172 మంది గైర్హాజరయ్యారు. ఏడో తరగతిలో ఖాళీల భర్తీకి 495 మందికి 430 హాజరయ్యారు. 8వ తరగతి కోసం 460 మందికి 410 మంది, 9వ తరగతికి 344 మందికి గాను 295 మంది హాజరయ్యారు. పదో తరగతిలో ప్రవేశాల కోసం 62 మందికి 55 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 2,959 మంది విద్యార్థులకు 2616 మంది హాజరయ్యారని, 343 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాజు తెలిపారు.